ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 29 జూలై 2024


షాద్‌నగర్‌లోని పరిగి రోడ్డులో గల పోచమ్మ ఆలయం వద్ద పోసిన కుంబం


సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

పేదలకు ఆసరాగా సీఎం సహాయనిధి

కొందుర్గు, జూలై 28 : సీఎం సహాయనిధి పేదలకు ఆసరాగా నిలిచి ప్రాణాలను కాపాడుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కొందుర్గు మండలం మూట్పూర్‌కు చెందిన కొనింటి శ్రీధర్‌కు 1.5లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీని ఎమ్మెల్యే అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధితో నేడు నిరుపేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది ప్రాణాలు కాపాడుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో నియకులు అంజయ్య, నర్సింలు, రామ్‌రెడ్డి, శ్రీనివాస్, ద్విజేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు

ఆషాఢ బోనాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎల్లమ్మ, పోచమ్మ మైసమ్మ, బాలమ్మ తదితర గ్రామ దేవతలకు బోనాలతో నైవేద్యాన్ని సమర్పించారు. డప్పులు, బ్యాండ్ మేళ తాళాల మధ్య మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకొని గుళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసం, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కొందరు ఆడవారు నెత్తిపై బోనమెత్తుకొని, వేపకొమ్మలు పట్టుకొని శిగమూగారు. బోనాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. బంధువులు, స్నేహితులను ఆహ్వానించి విందు భోజనాలు ఆరగించారు. చిన్నాపెద్ద ఉత్సాహంగా గడిపారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, జూలై 28


కందుకూరు మండలం ఆకులమైలారంలో వేడుక



మొయినాబాద్ హిమాయత్‌నగర్‌లో రోడ్లపై సంచరిస్తున్న కుక్కలు

- వణికిపోతున్న చిన్నారులు, వృద్ధులు
- జనవరి ఒకటి నుంచి జూలై 28 వరకు 2,389 కుక్కకాటు కేసులు నమోదు
- వీటి బారిన పడుతున్నవారు సరాసరి రోజుకు 12 మంది

ఒకప్పుడు వీధి కుక్కలంటే ఆ వాడకు రక్షణగా ఉండేవి. ఎవరైనా అపరిచితులు వచ్చినా, రాత్రి పూట ఆగంతకులు చొరబడినా పసిగట్టి మొరుగుతూ ప్రజలను అప్రమత్తం చేసేవి. కానీ, ఇప్పుడు అవే కుక్కలు ప్రజలు, పసిపిల్లల పాలిట మృత్యు మృగాలుగా మారాయి. ఒంటరిగా దొరికినా, బంధువుల రక్షణలో ఉన్నా వెంటపడి మరీ దాడి చేస్తున్నాయి. ఒక్కోసారి ప్రాణాలు తీస్తున్నాయి. జిల్లాలో ఏదో ఒకచోట కుక్కకాటు కేసులు నమోదవుతూనే ఉన్నాయి.

శునకం.. భయానకం!

కుక్కకాటు ఘటనలు మచ్చుకు కొన్ని..

- ఈ నెల 17న మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన అమీర్‌గూడలో వీధి కుక్కల దాడిలో మూడేళ్ల బాలిక అఖిల తీవ్రంగా గాయపడింది.
- ఫిబ్రవరి 2వ తేదీ శంషాబాద్ మండలం బలహీనవర్గాల కాలనీ పక్కనే గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వలస వచ్చిన కార్మికులు సూర్యకుమార్ రెండేళ్ల కొడుకును కుక్కలు కరిచి చంపాయి.
- వారం రోజుల ముందు శంషాబాద్‌లోని హైమద్‌నగర్ కాజీ గల్లిగొల్లపల్లి దర్వాజ ప్రాంతంలో ఆరుగురు చిన్నారులపై కుక్కలు దాడిచేసి గాయపర్చాయి.
- వారం క్రితం యాచారం మండలం నానక్‌నగర్, తాడిపర్తి, చిన్నతూండ్లలో ఒంటరిగా వెళుతున్న రైతులను కరిచి గాయపర్చాయి.

దడ పుట్టిస్తున్న వీధి కుక్కలు ›› రోడ్లపై గుంపులు గుంపులుగా సంచారం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 28 : జిల్లాలో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. ఆరు బయట ఆడుకుంటున్న చిన్నారులపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. వీధి కుక్కల సమస్య తీవ్రమవుతోంది. నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో అవి గుంపులు గుంపులుగా తిరుగుతూ పిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. నిత్యం ఎక్కడో ఓ చోట కుక్క కాటుతో బాధితులు ఆసుపత్రిలో చేరుతూనే ఉన్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్లపై సంచరిస్తూ దడ పుట్టిస్తున్నాయి. ఒంటరిగా వెళ్లాలంటే పిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యార్థులు బడికి వెళ్లేటప్పుడు ఎవరో ఒకరు తోడుగా వెళ్లాల్సి వస్తోంది. వీధుల్లో తిరుగుతున్న కుక్కలతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఇలా వీధి కుక్కల బెడద భరించలేనంతగా పెరిగిపోతోంది. కనిపించిన వారిని కనిపించిన చోట కరుస్తూనే ఉన్నాయి. చిన్న చిన్న గాయాలతో బయటపడ్డ వాళ్లు కొందరైతే, ముఖంపై, కాళ్లపై, శరీరంపై లోతైనా గాయాలతో నరకయాతన అనుభవిస్తున్న వారు మరికొందరు. కుక్కల దాడుల వల్ల ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. కొన్ని కాలనీల్లో ఐతే ఇళ్లల్లో నుంచి అడుగు తీసి బయట పెట్టాలంటే వణికిపోతున్నారు. ఏ వీధిలో చూసినా సుమారు పాతికకు తక్కువ కాకుండా శునకాలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. అందులో ఏది మంచి కుక్కో, ఏది వ్యాధి సోకిన కుక్కో తెలియని పరిస్థితి. కుక్కకాట్లతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ఈ యేడాది జనవరి ఒకటి నుంచి జూలై 28 వరకు జిల్లాలో 2,389 కుక్కకాట్ల కేసులు నమోదయ్యాయి. అంటే సరాసరిగా రోజుకు 12మంది కుక్కకాటు బారిన పడుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది.


కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి అఖిల(ఫైల్)

మాంసానికి అలవాటు పడి..

జీవ వ్యర్థాలు, వృథా ఆహారం కాస్త ఎక్కువగా లభించే ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఫంక్షన్‌హాల్స్, మటన్, చికెన్ షాపుల వద్ద వ్యర్థాలను తినేందుకు అలవాటు పడ్డాయి. అక్కడ ఆహారం లభించనప్పుడు జనావాసాల వైపు తరలి వస్తున్నాయి. ఆ సమయంలో చేతిలో సంచితో వెళ్లే ప్రజలపై విరుచుకు పడుతున్నాయి. వాటిని ప్రతిఘటించలేక అనేకమంది తీవ్రంగా గాయపడుతున్నారు. అది ప్రాణాలు కోల్పోయే వరకు వస్తుంది. మాంసానికి అలవాటు పడిన కుక్కలు గ్రామాల్లో మేకలు, గొర్రెల మందలపై కూడా దాడులు చేస్తున్నాయి. దొరిన వాటిని పీక్కు తింటున్నాయి. ఇటీవల యాచారం మండలం మంగలిగడ్డ తండాలో సేవ్య నాయక్‌కు చెందిన రెండు గేది దూడలను, మల్లయ్యకు చెందిన 15మేకలపై దాడి చేశాయి.

నిర్లక్ష్యమే అభాగ్యులకు శాపం

సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం వీధి కుక్కలన్నింటికీ స్థానిక సంస్థల అధికారులు రేబిస్ టీకాలు వేయించాలి. సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయించాలి. కానీ, అవేవీ అమలుకు నోచుకోవడం లేదు. ఈ నిర్లక్ష్యపు వైఖరే అభాగ్యులు పాలిట శాపంగా మారిందని నిపుణులు చెబుతున్నారు. కుక్కల బెడద తగ్గించడానికి అవసరమైన నిధులు కేటాయింపులు జరగడం లేదనేది మరో వాదన. వాస్తవానికి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో కుక్కలను పట్టేందుకు ప్రత్యేకంగా వ్యాన్‌ల ఏర్పాటుతో పాటు బృందాలను నియమించాలి. కుక్కలను బంధించి ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాలకు తరలించి శస్త్రచికిత్సలు చేసి వదిలేయాలి. అనారోగ్యంతో ఉన్న, రేబిస్ సోకిన కుక్కలను గుర్తించి చికిత్స అందించాలి. కానీ, నిధుల కొరత సమస్యగా మారిందని నిపుణులు చెబుతున్నారు.

ప్రతీ రోజు ఇబ్బందులు పడాల్సి వస్తుంది



గ్రామంలో ప్రతి కాలనీలో కుక్కల బెడద ఎక్కువైంది. ఇటీవల నా కూతురిపై కుక్కలు దాడి చేశారు. సమయానికి నేను అక్కడే ఉండి దానిని అడ్డుకున్నాను. లేదంటే.. పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. అప్పటికే కుక్కకాటు వల్ల నా కూతురు గాయపడింది. పిల్లలను బయటకు పంపాలంటేనే భయమేస్తుంది. గుంపులు గుంపులుగా తిరుగుతూ దొరికన వారిని కరుస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించాలి. కుక్కలను పట్టుకెళ్లి అడవిలో వదిలేయాలి.

- ఎం.వెంకటేష్, అమీర్‌గూడ, మొయినాబాద్ మండలం


కుక్కల దాడి నుంచి చిన్నారులను రక్షించాలని చేవెళ్ల ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

కల్వకుర్తి నియోజకవర్గానికి

సీఎం వరాల జల్లు

- ఆమనగల్లులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని హామీ
- రూ.180కోట్లతో తండాలకు బీటీ రోడ్లు
- మాడ్గుల మండలంలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
- మీర్కాన్‌పేట వద్ద వృత్తి నైపుణ్య యూనివర్సిటీకి స్థల పరిశీలన


వృత్తి నైపుణ్య వర్సిటీ ఏర్పాటుపై మాట్లాడుతున్న సీఎం

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం/కందుకూరు, జూలై 28 : కల్వకుర్తి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్ర గేటు వద్ద కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిలతో కలిసి వచ్చారు. అంతకు ముందు బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా, ముఖ్యమంత్రిగా మీ బిడ్డనను ఆదరించారని, భుజాన ఎక్కించుకుని తిప్పారన్నారు. మీ కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం కల్వకుర్తికి వరాలు ప్రకటించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు తాను కూడా అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. కల్వకుర్తిలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామన్నారు. బీటీ రోడ్లకు రూ.180కోట్లు వెచ్చిస్తామని ప్రకటించారు. ఆమనగల్లులో వృత్తి నైపుణ్య శిక్షణకు రూ.10కోట్లతో స్కిల్ డెవలప్‌సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆమనగల్లులో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కాలేజీలకు భవనాల నిర్మిస్తామన్నారు. మాడ్గుల మండలంలో పాఠశాలల అభివృద్ధికి రూ.10కోట్లు, మాడ్గులలో డ్రెయిన్ల నిర్మాణానికి రూ.5కోట్లు విడుదల చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. కడ్తాల సమీప ముచ్చర్ల వద్ద 50ఎకరాల్లో రూ.100కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని సీఎం వెల్లడించారు. ఆగస్టు 1న దీనికి శంకుస్థాపన చేస్తామని ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు. ఇక్కడ ఏటా 20 వేల మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని తండాలకు బీటీ రోడ్లు వేస్తామన్నారు. హైదరాబాద్-శ్రీశైలం హైవేను త్వరలోనే నాలుగు లేన్లకు విస్తరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో కల్వకుర్తికి చెందిన ముగ్గురు మహిళలు తమకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ - మిగతా 7లో

వ్యాధుల కాలం.. అప్రమత్తతే ముఖ్యం

ముందస్తు చర్యలు తప్పనిసరి -7లో



ఈసీ, మూసీ వెలవెల


అంతంతమాత్రం నీరున్న గండిపేట చెరువు


అమ్డాపూర్ వద్ద ఎండిన ఈసీ వాగు

మొయినాబాద్ రూరల్, జూలై28: రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. జలాశయాలకు వరద పెరిగింది. కానీ నగర శివార్లలోని హిమాయత్‌సాగర్, గండిపేటలకు మాత్రం నీరు చేరలేదు. నెల రోజులుగా తరచూ ముసురు కురుస్తోంది తప్పితే పెద్ద వానల్లేక జలశయాల్లోకి నీరు చేరలేదు. ఈ జంట జలాశయాలకు ఎగువన వికారాబాద్ జిల్లాలోనూ ఆశించిన మేర వానలు కురవడం లేదు. దీంతో జంట వాగులైన ఈసీ, మూసీల్లో నీరు లేదు. గతేడాది ఇదే సమయంలో ఈ వాగులు ఉప్పొంగాయి. హిమాయత్‌సాగర్, గండిపేట చెరువుల్లో సైతం గరిష్ట నీటిమట్టానికి చేరడంతో క్రస్టుగేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ వానకాలంలో మాత్రం వాగులు, చెరువుల్లోకి నీరు చేరక నెర్రెలు వారాయి.

కలుపు తీతకు కూలీల కొరత

చేలల్లో పేరుకుంటున్న గడ్డి

- ఎదగని పంట మొక్కలు
- రైతుల సతమతం


చౌదర్‌పల్లిలో పత్తిలో కలుపుతీస్తున్న కూలీలు


ధర్మన్నగూడలో పత్తి చేనులో పెరిగిన కలుపు

యాచారం, జూలై 28: కలుపు తీతకు కూలీల కొరత ఏర్పడింది. దీంతో పంటచేలల్లో గడ్డి విపరీతంగా పెరిగి పంట మొక్కలు ఎదగడం లేదు. పత్తి, జొన్న, ఆముదం, టమాట తదితర పంటల్లో కలుపు తీసేందుకు కూలీలు దొరకడం లేదు. కొందరు రైతులు ముందుగానే కూలీలకు అడ్వాన్స్‌గా డబ్బు ఇచ్చి రప్పించుకుంటున్నారు. కూలీల కొరతతో రైతు కుటుంబీకులు చిన్నాపెద్ద కలుపు తీసుకుంటున్నారు. అయితే ఎకరాల కొద్దీ పంట ఉండడంతో ఎంతకూ కలుపు తీత పూర్తి కావడం లేదు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు పనిచేస్తే రూ.500 కూలి ఇస్తారు. అంత డబ్బు ఇచ్చినా కూలీలు దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు కూలి రూ.550 ఇచ్చి పని చేయించుకుంటున్నారు. కలుపు నివారణకు గుంటుక తోలినా కలుపు తగ్గక మనుషులతో కలుపు తీయించుకుంటున్నారు. మండలంలోని ధర్మన్నగూడ, మేడిపల్లి, చౌదర్‌పల్లి, నందివనపర్తి, కొత్తపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి, నల్లవెల్లి తదితర గ్రామాల్లో కూలీలు దొరకక చేలల్లో కలుపు పేరుకుందని రైతులు చెబుతున్నారు. కూలీలు రాక తామే అయినంత మేరకు కలుపు తీసుకుంటున్నామని ధర్మన్నగూడకు చెందిన రైతు శ్యామల తెలిపారు. కూలీలు దొరకక కలుపు నివారణ మందులు వాడితే కొన్ని పంట మొక్కలు కూడా ఎండుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. కలుపు పేరుకొని పంట ఎదగడం లేదని ఆందోళన చెందుతున్నారు. తాము పంటల కోసం వేసిన ఎరువులన్నీ కలుపు మొక్కలకే పోతుందని అంటున్నారు.

కూలీలు దొరకడం లేదు



పత్తి చేనులో కలుపు తీద్దామంటే కూలీలు రావడం లేదు. రోజురోజుకూ గడ్డి పెరుగుతోంది. వారం రోజులుగా ముసురుతో మొక్కలన్నీ గడ్డిలో కలిసిపోయాయి. పత్తి, జొన్న, కంది, టమాట పంటల్లో కలుపు పెరిగింది. చేనుకు ఎరువు వేద్దామన్నా కలుపుతో కుదరడం లేదు. రెండు రోజుల్లో చేనుకు మందు వేయకుంటే మళ్లా వర్షాలు వచ్చే వరకు వేచి ఉండాలి. రోజుకు రూ.500 ఇస్తాంముంటున్నా కలుపుతీతకు కూలీలు రావడం లేదు.

- శంకరమ్మ, రైతు, చౌదర్‌పల్లి

భూ సమస్య పరిష్కరించాలని.. సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి

పోలీసుల చొరవతో దిగిన తలకొండపల్లి మండలవాసి

తలకొండపల్లి, జూలై 28 : భూ సమస్యను పరిష్కరించాలని ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి హంగామా చేశాడు. సమస్య పరిష్కరించేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో అతడు టవర్ దిగాడు. వివరాల్లోకి వెళ్తే.. తలకొండపల్లి మండలం పూల్‌సింగ్ తండా పరిధి బూడియానాయక్ తండాకు చెందిన మేగవత్ సోమ్లా నాయక్ పొలం వద్ద దాయాదులతో ఉన్న భూ, బాట వివాదాన్ని పరిష్కరించాలని ఆదివారం తలకొండపల్లిలో ఉన్నత పాఠశాల వద్ద ఉన్న ఓ సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. తనకు న్యాయం చేసేంత వరకు టవర్ దిగనని భీష్మించాడు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో అక్కడికి చేరుకొని ఫోన్‌లో సోమ్లాతో మాట్లాడారు. తన భూ వివాదాన్ని పరిష్కరిస్తేనే దిగుతానని సోమ్లానాయక్ అనడంతో.. ఎస్సై నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. చివరకు అతడు టవర్ దిగాడు. అనంతరం సోమ్లానాయక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


సెల్‌టవర్‌పై సోమ్లానాయక్







విడుదల కాని పాఠశాల నిధులు

ప్రధానోపాధ్యాయులకు తప్పని తిప్పలు

మేడ్చల్, జూలై 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు నిధులు విడుదల కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు తిప్పలు తప్పడం లేదు. నిధులు ఉంటేనే ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణ సాధ్యపడుతుంది. పాఠశాలల్లో అవసరమైన వస్తువులు కొనేందుకు ప్రభుత్వం ఏటా నిధులు విడుదల చేస్తుంది. కానీ ఈసారి మాత్రం ఇంత వరకు మంజూరు చేయలేదు. ప్రతీ విద్యా సంవత్సరంలో రెండుసార్లు నిర్వహణ నిధులు మంజూరు చేస్తుంది. 2024-25 విద్యాసంవత్సరం ప్రారంభమై నెలన్నర రోజులు దాటినా.. ఇంతవరకు నిధులు మంజూరు చేయలేదు. ఏటా జూలై మొదటి వారంలోనే మొదటి విడత నిధులను విద్యాశాఖ విడుదల చేసేది. ఈ ఏడాది ఇంత వరకు రాకపోవడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులు వెచ్చించి ఇబ్బంది పడుతున్నారు. నిధుల విడుదలకు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 375 ప్రాథమిక పాఠశాలలు, 22 ప్రాథమికోన్నత పాఠశాలలు, 108 ఉన్నత పాఠశాలలు, 10 ఎయిడెడ్ పాఠశాలలు మొత్తం 515 పాఠశాలలున్నాయి. తరగతి గదుల నిర్వహణకు హాజరు రిజిస్టర్, విద్యుత్ బిల్లులు, తాగునీరు, చిన్న మరమ్మతులు, చాక్‌పీసులు, ప్రయోగశాలలకు అవసరమైన సామగ్రి, పాఠశాలల్లో ఇతర అవసరాలకు డబ్బులు కావాలి. అదేవిధంగా పరీక్షల నిర్వహణ, జాతీయ పండుగల నిర్వహణకు వినియోగించాల్సి ఉంటుంది. వీటిని పాఠశాలలకు వచ్చే నిధుల నుంచే కొనుగోలు చేయాలి. గత సంవత్సరం మొదటి విడత తొందరగా విడుదల చేసినా రెండో విడత మాత్రం మార్చిలో ఇచ్చి వెంటనే ఖర్చు చేయాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రధానోపాధ్యాయులు ఆగమేఘాల మీద వాటి లెక్కలు సమర్పించారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు అందిస్తుంది. విద్యార్థుల సంఖ్య 1-30 వరకు ఉంటే రూ.10వేలు, 31-100లోపు ఉంటే రూ.25వేలు, 101-250 వరకు ఉంటే రూ.50వేలు, 251-1000 వరకు ఉంటే రూ.75 వేల చొప్పున సంవత్సరానికి మంజూరు చేస్తుంది. వెయ్యి మంది కంటే ఎక్కువగా ఉంటే రూ.లక్ష వరకు వస్తాయి.

లేని క్రీడా పరికరాలు..

ప్రతీ పాఠశాలలకు క్రీడల నిధులు రావాల్సి ఉంది. ఆయా పాఠశాలల్లో పీడీలు, పీఈటీలు ఉన్నా వివిధ రకాల ఆటలు ఆడించేందుకు చాలా చోట్ల పరికరాలు లేవు. క్రీడల నిర్వహణకు ఇంత వరకు నిధులు ఇవ్వలేదు. వచ్చే ఆగస్టు నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటలు జరుగనున్నాయి. వాటిలో పాల్గొనాలంటే విద్యార్థులకు శిక్షణ అవసరం. చాలా పాఠశాలల్లో గ్రామస్తులు, యువజన సంఘాల వారు, ప్రజా ప్రతినిధులు క్రీడా పరికరాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. అదే ప్రభుత్వం ఇస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



గౌడవెల్లి ప్రభుత్వ పాఠశాల

త్వరలోనే నిధుల విడుదల



స్కూల్ గ్రాంట్స్ త్వరలోనే విడుదలయ్యే అవకాశముంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అప్పటి వరకు ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి.

- విజయకుమారి, జిల్లా విద్యాధికారి











మానవాళి మనుగడకు చెట్లే ఆధారం


అర్బన్ ఫారెస్ట్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్, జూలై 28: భవిష్యత్తులో మానవాళి మనుగడకు చెట్లే ఆధారమని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం శివారులో ఉన్న అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పూర్తిగా సహకరించినప్పుడే వన మహోత్సవం విజయవంతమౌతుందన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామాలకు మొక్కల పంపిణీ సక్రమంగా జరిగేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమంలో కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత, ఫారెస్ట్ అధికారులు రవీందర్‌గౌడ్, అజీజ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంజుల




చేవెళ్ల, జూలై 28 : నిరంతరం మహిళల హక్కుల కోసం పోరాటం చేస్తూ పేదల పక్షాన నిలబడే నిఖార్సైన చేవెళ్ల మండల మహిళ నాయకురాలు వడ్ల మంజుల.. భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చేవెళ్లలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాటం చేస్తామన్నారు. తనపై నమ్మకంతో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీ పెద్దలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, సత్యనారాయణ, సత్తిరెడ్డి, మక్బూల్, శివయ్య, అంజయ్య, సుధాకర్‌గౌడ్ తదితరులు హర్షం వ్యక్తం చేసి మంజులకు శుభాకాంక్షలు తెలిపారు.


చెల్మారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోదండరాం

రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో స్థానికులకు వాటా ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం, జూలై 28 : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రంగారెడ్డి జిల్లాకు అస్తిత్వం లేకుండా చేశారని, జిల్లా అభివృద్ధిలో స్థానిక ప్రజలకు వాటా ఇచ్చినప్పుడే అభివృద్ధిలోకి వస్తుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరాం అన్నారు. రంగారెడ్డి జిల్లాతో హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులే బాగుపడ్డారని, ప్రజల బతుకుల్లో ఆశించినంత మార్పు రాలేదన్నారు. గతంలో తెలంగాణ జేఏసీ జిల్లా కన్వీనర్‌గా ఉన్న వెదిరె చెల్మారెడ్డి ప్రథమ వర్ధంతి సభ ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని భారత్ గార్డెన్స్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పాలనలో ఉద్యమకారులకు న్యాయం జగరలేదని, ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం జరిగేట్లు చూడాలని పలువురు వక్తలుచేసిన ప్రస్తావనకు ఉద్యమకారులు సంఘటితంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించుకుంటామన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను ఒక పుస్తకంలా తేవాల్సిన అవసరముందన్నారు. ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన చెల్మారెడ్డి విగ్రహం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానంటూ చెప్పారు.



ఘనంగా కొడి పీర్ల ఉత్సవాలు


అక్నాపూర్‌లో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్థులు

నవాబుపేట, జూలై 28: మండలంలోని అక్నాపూర్ గ్రామంలో కొడి పీర్ల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కులమతాలకతీతంగా ప్రజలు పీర్ల ఉత్సవాల్లో పాల్గొన్నారు. విద్య మౌలిక వసతుల మాజీ చైర్మన్ జి.నాగేందర్‌గౌడ్ ఉత్సవాల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. గ్రామంలోని పురవీధుల మీదుగా పీర్ల ఊరేగింపుతో సమీప చెరువుల్లో పీర్లను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావలి స్వరూప భీమయ్య, మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు మల్లేశ్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు నల్లోల్ల యాదగిరి, సంతోష్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహులు, గోపాల్, మాణిక్యం, రజాక్, ఖాజ మియ, మోయిన్, మన్సూర్ అలీ, షబ్బీర్ పాల్గొన్నారు.

పూడూరు వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న సయ్యద్ ఆదిల్ అహ్మద్

పూడూరు, జూలై 28: గ్లోబల్ హ్యూమన్ పీస్ ఇంటర్‌నేషనల్ వర్చువల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పీపుల్ ఫోరం ఆఫ్ ఇండియా భారత్ సేవక్ సమాజ్ వారు వివిధ రంగాలతోపాటు సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించింది. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని మన్నెగూడకు చెందిన ఆదిల్ గ్రూప్స్ చైర్మన్ సయ్యద్ ఆదిల్‌అహ్మద్ సామాజిక సేవారంగంలో విశిష్ట సేవలను గుర్తించి సయ్యద్ ఆదిల్ అహ్మద్‌కు గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఈ మేరకు ఆదివారం గ్లోబల్ హ్యూమన్ పీస్ ఇంటర్‌నేషనల్ వర్చువల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పీపుల్ ఫోరం ఆఫ్ ఇండియా భారత్ సేవక్ సమాజ్ వారు ఢిల్లీలోని శ్రీసత్య సాయి ఆడిటోరియంలో నిర్వహించిన డాక్టరేట్ ప్రదానోత్సవంలో ఆదిల్ అహ్మద్ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు డాక్టర్ మానుఎల్, వరల్డ్ పీస్ ఇనిస్టిట్యూట్ యూనైటెడ్ నేషనల్ ఫౌండర్ పర్వీందర్‌సింగ్, తమిళనాడు స్పెషల్ కమిషనర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఐఏఎస్ సంపత్‌కుమార్ చేతుల మీదుగా ఈ పట్టాను అందుకున్నారు. ఆయన డాక్టరేట్ పట్టాతో పాటు జాతీయ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును అందుకున్నారు. ఆదిల్ అహ్మద్ డాక్టరేట్ పట్టా అందుకోవడంతో వికారాబాద్ జిల్లాతో పాటు పూడూరు మండల, మన్నెగూడ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ముదిరాజ్ సంఘం అభివృద్ధికి సహకారం

తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్


జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు


చేవెళ్ల, జూలై 28 : ముదిరాజ్ సంఘం అభివృద్ధికి నిరంతరం తోడ్పటునందిస్తామని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ తెలిపారు. ఆదివారం చేవెళ్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఊరడి నర్సింలు ముదిరాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జ్ఞానేశ్వర్‌ను ఆయన నివాసంలో నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ ముదిరాజ్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ముదిరాజ్ సంఘాలను అన్ని గ్రామాల్లో బలోపేతం చేసి అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంతో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శులు చామంతి శివరాజ్, శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గోపాల్, నాయకులు సునిగంటి శ్రీకాంత్, గణేశ్, వెంకటేశ్, కృష్ణమోహన్, మల్లేశ్, కుమార్, రాము, భిక్షపతి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ చేయూత


విద్యార్థులకు సామగ్రిని అందజేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

ఆమనగల్లు, జూలై 28: అనాథ ఆశ్రమ విద్యార్థులకు ఆమనగల్లు లయన్స్ క్లబ్ చేయూతనందించింది. రూ. 60వేల వస్తు సామగ్రిని సమకూర్చి ఆదివారం అందజేసింది. సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, హైదరాబాద్ సెంచరీయల్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ చంపాపేట్ వైదేహి ఆశ్రమానికి చెందిన 75 మంది విద్యార్థులకు, కారుణ్య సింధు ఆశ్రమానికి చెందిన 25 మంది విద్యార్థులకు దుప్పట్లు, పుస్తకాలు, నిత్యావసర సరుకులు సమకూర్చారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా వందమంది విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్ధులు, అనాథలు, నిరుపేదలకు లయన్స్‌క్లబ్ అండగా నిలుస్తుందని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్లు జూలూరి రమేశ్, కసిరెడ్డి రాంరెడ్డి, బండెల రాంచంద్రారెడ్డి, పీఆర్వో ఎం.ఎ పాష ఆశ్రమ నిర్వాహకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల హక్కుల సాధనకు కృషి చేద్దాం


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అరవిందరావు

పరిగి, జూలై 28: బ్రాహ్మణుల హక్కుల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని బ్రాహ్మణసేవా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కె.అరవిందరావు అన్నారు. పరిగిలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఆదివారం జిల్లా కార్యవర్గ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణులు వెనుకబడి పోతున్నారని అన్నారు. బ్రాహ్మణుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించి వారి సంక్షేమానికి ఖర్చు చేయాలని కోరారు. బ్రాహ్మణులంతా ఒక్కతాటిపైకి వస్తే సమస్యలను పరిష్కరించుకోవడం సులభంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసమితి రాష్ట్ర నాయకులు సిద్ధాంతి పార్థసారథి, ప్రహ్లాద్‌రావు, పురుషోత్తమ్‌రావు, జిల్లా కార్యదర్శి దత్తాత్రాయ, పరిగి తాలుకా అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి జోషి శ్రీకాంత్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లను స్థానికులకే ఇవ్వాలి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 28: ఘట్‌కేసర్ మండలంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికులకే ఇవ్వాలని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం వెంకటాపూర్‌లోని డబుల్ బెడ్‌రూంల ఇళ్లను సందర్శించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ.. మండలంలో ప్రతాప్‌సింగారం, వెంకటాపూర్ గ్రామాల్లో డబుల్‌బెడ్ రూంల ఇళ్లను నిర్మించిందని, ఈఇళ్లు స్థానికులకు కాకుండా నగరంలో ఉండే వారికి గత ప్రభుత్వం కేటాయించిందన్నారు. కానీ స్థానికులకు ఇవ్వకుండా నగరవాసులకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఘట్‌కేసర్ మండలంలో అర్హులైన ఇళ్లులేని పేదలకు డబుల్‌బెడ్ రూంల ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

స్థానిక సమరానికి అడుగులు



- కసరత్తును ప్రారంభించిన ఎన్నికల సంఘం
- ఆగస్టు 3న ఎంసీహెచ్ ఆర్‌డీలో వర్క్‌షాప్
- ఆగస్టు 5 నుంచి ఓటర్ల గుర్తింపు ప్రక్రియ

తాండూరు, జూలై 28: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అడుగులు పడ్డాయి. సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించిన 24గంటల్లోనే ప్రక్రియకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. నిర్దిష్ట కాల పరిమితిని నిర్దేశించి ప్రక్రియను చేపట్టేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఓటర్ల వివరాలు సేకరించేందుకు అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆపరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఎన్నిలక సంఘం కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవో)కు సూచిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికలు-2024 ఎలక్టోరల్స్‌కు అవసరమైన ఐదుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు లేదా ప్రతీ జిల్లా నుంచి టీవోటీలుగా నియమించాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వార్డుల వారీగా ఎన్నికల మ్యాపింగ్‌పై శిక్షణ ఇవ్వడానికి గ్రామ పంచాయతీ ఏసీఈఆర్‌లను స్వీకరించడానికి అధికారులు, సిబ్బందిని నియమించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. తాజా అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలను వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా మ్యాపింగ్‌పై డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణను ఇవ్వాలని నిర్ణయించారు. హైదరాబాద్ నగరంలోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. ఆగస్టు 3న ఉదయం 10-30 గంటల నుంచి మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఐదుగురి చొప్పున డేటా ఆపరేటర్లకు, శిక్షకులకు వర్క్‌షాపులో ఓటర్ల జాబితాపై శిక్షణ ఇస్తారు. శిక్షణకు హాజరయ్యే ఆపరేటర్లు, శిక్షకుల పేర్లను ఈనెల 31వ తేదీలోపు అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వాస్తవానికి గతంలోనే ఏర్పాట్లు

గతేడాది డిసెంబర్‌లోనే సర్పంచ్ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. 200 మంది ఓటర్లకు ప్రిసైడింగ్ అధికారితో పాటు పోలింగ్ అధికారి ఉంటారు. 201-400 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401-650 వరకు ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. 650 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు.

బ్యాలెట్ బాక్స్‌ల వివరాల సేకరణ



పార్లమెంటు ఎన్నికల ముందే ఎన్నికల సంఘం బ్యాలెట్ బాక్స్‌ల వివరాలు, కావాల్సిన సిబ్బంది వివరాలను సేకరించిన విషయం విదితమే. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ వేగవతం కావడంతో మరిన్న వివరాలను సేకరిస్తారు.

తాండూరు సబ్ డివిజన్‌లో 267 పంచాయతీలు

తాండూరు సబ్‌డివిజన్ పరిధిలోనితాండూరు, కొడంగల్ నియోజకవర్గాలకు సంబంధించి 267గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కోట్‌పల్లిలో 18, తాండూరులో 33, పెద్దేముల్‌లో 37, యాలాలలో 37, బషీరాబాద్‌లో 36, కొడంగల్ 26, బొంరాస్‌పేట్‌లో 47, దౌల్తాబాద్‌లో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

రిజర్వేషన్లపై సందిగ్ధతకు తెర



కులగణన తర్వాత ఎన్నికల వేళ ఓటర్ల జాబితా ఆధారంగా రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టాలన్న సందిగ్ధతకు తెరపడింది. ఓటర్ల జాబితా ప్రాతిపదికన పంచాయతీరాజ్ శాఖను నోడల్ ఏజెన్సీగా నియమించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఓటర్ల వివరాలు సేకరించాలని నిర్ణయిస్తూ బీసీ కమిషన్ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పాత రిజర్వేషన్లే ఉంటాయన్నది స్పష్టమవుతోంది. ఆగస్టు 5వ తేదీ తర్వాత ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ ఓబీసీల వివరాల సేకరణ ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. వార్డుల వారీగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని పంచాయతీరాజ్ శాఖ అధికారికి ఒకరు చెప్పారు.

జింకపై శునకాల దాడి

కాపాడి ఆస్పత్రికి చేర్చిన మాజీ సర్పంచ్



యాచారం, జూలై 28: నందివనపర్తిలో పొలంలో మేత మేస్తున్న జింకపై కుక్కలు దాడి చేసి కరిచాయి. ఆదివారం మధ్యాహ్నం మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్ పొలం వద్ద కుక్కలు జింకను చంపి తినేందుకు యత్నించాయి. అది చూసిన విజయ్‌కుమార్ కుక్కలను తరిమి గాయపడ్డ జింకను తన కారులో యాచారంలోని ప్రభుత్వాసుపత్రికి తెచ్చి ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు జింకను నగరంలోని జూపార్క్‌కు తరలించారు. జూ వైద్యులు జింకకు చికిత్స చేస్తున్నారని ఆయన తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి సేవలు మరువలేనివి


పంచాయతీ కార్యదర్శి శేఖర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కేశంపేట, జూలై 28: మండల పరిధిలోని చింతకుంటపల్లి పంచాయతీ కార్యదర్శి శేఖర్ సేవలు మరువలేనివని అనేమోని బ్రదర్స్ పారేశ్, కృష్ణ అన్నారు. బదిలీపై వెళ్తున్న శేఖర్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన చింతకుంటపల్లి గ్రామ పంచాయతీకి కార్యదర్శి శేఖర్ తనవంతుగా ఎంతో కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పద్మ, రఘుమారెడ్డి, పద్మమ్మ, గిరిజ, పాఠశాల చైర్మన్ అనేమోని రాధ తదితరులు పాల్గొన్నారు.

కురుమల సమస్యను అసెంబ్లీలో చర్చిస్తా


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

తాండూరు, జూలై 28: కురుమ సామాజిక వర్గానికి తప్పుడు ధ్రువపత్రాల విషయమై జరుగుతున్న అన్యాయంపై అసెంబ్లీలో లేవనెత్తుతానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు క్యాంపు కార్యాలయంలో కురుమ సంఘం తాండూరు డివిజన్ ప్రతినిధుల బృందం ఆదివారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తమకు బీసీ-బీ సీరియల్ నెంబర్-11 ప్రకారం కురుమ అని తప్పుడు కులం సర్టిఫికెట్ ఇస్తున్నారని తెలిపారు. అధికారులతో చర్చించి మాదిసి కురుమ, మాదారి కురుమ కులం సర్టిఫికెట్లను ఇప్పించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా అసెంబ్లీలో చర్చించి రాజ్యాంగం ప్రకారంగా గెజిట్ నెం-30 ప్రకారం రావాల్సిన మాదాసి కురుమ కుల సర్టిఫికెట్లు ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కురువ సంఘం ఉపాధ్యక్షుడు పూజారి పాండు, కార్యదర్శి ఇందూరు మల్లేశం, జిన్‌గుర్తి నర్సింహులు, పల్లె వెంకటయ్య, హనుమయ్య, కందనెల్లి రాఘవేందర్ (రఘు), మంబాపూర్ రాజు, సాయిపూర్ తుల్జప్ప, కొత్తూరు బాలప్పలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయమైన 'ప్రజాభవన్'లో ఆదివారం వినతులను స్వీకరించారు. వినతిపత్రాల ద్వారా స్వయం చెపుకున్న వారి వివరాలను విన్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కాలనీల సమస్యల, వ్యక్తిగత సమస్యలను పలువురు ఎమ్మెల్యేకు వివరించారు. వర్షాకాలంలో కాలనీల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ

తాండూరు రూరల్: మండలంలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జర్నె నాగప్ప గుండెపోటుతో కొంత కాలంగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆయన ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ చేసుకుని ప్రస్తుతం తన స్వగ్రామంలోని ఇంటికి చేరుకున్నారు. కాంగ్రెస్ నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న తాండూరు ఎమ్మెల్యే ఆదివారం గౌతాపూర్‌లోని నాగప్ప ఇంటికి వెళ్లారు. ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు.అంతకుముందు నాగప్ప హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు సాయిపూర్ బాల్‌రెడ్డి, నర్సింహులు తదితరులున్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తతే ముఖ్యం

ముందస్తు చర్యలు తప్పనిసరి


రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

చేవెళ్ల, జూలై 28 : సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున జూన్ నుంచి ఐదు నెలలపాటు అప్రమత్తంగా ఉంటూ పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. వానకాలంలో వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఆ తర్వాత వచ్చే చలికాలంలో మరింత అప్రమత్తత అవసరమని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. వైద్య, పంచాయతీ శాఖల సమన్వయంతో వ్యాధుల కట్టడికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గ్రామాలు, పట్టణాల్లో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సి అవసరం ఉంది. నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, మురికి కాలువను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. దోమలు కుట్టిన వెంటనే జ్వరం, కండరాలు నొప్పులు, వాంతులు దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయని, రక్త కణాలు తగ్గి ప్రాణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వైద్యులు తెలుపుతున్నారు. సాధారణ జ్వరాల పట్ల ప్రజలు జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని, పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, జలుబు, దగ్గు, ఆయాసం, శక్తిని కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నారు.

స్వైన్ ఫ్లూతో జాగ్రత్త

అక్టోబరు నుంచి మార్చి వరకు స్వైన్ ఫ్లూ కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి. వైరస్ శ్వాసకోశ వ్యవస్థపై దాడి చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుందని, స్వైన్‌ఫ్లూ సోకకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. లక్షణాలు ఉంటే వెంటనే టెస్టులు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

ఇలా చేస్తే మేలు

నీటి నిల్వ గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడంతో దోమలు లార్వాను నియంత్రించవచ్చు. మురుగు కాల్వల్లో పూడికతీత పనులతో పాటు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. కాలువల్లో రసాయన మందు పిచికారీ చేయాలి. ప్రధాన ప్రాంతాల్లో, అంతర్గత కాలనీల్లో నిత్యం బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. వార్డుల వారీగా పారిశుధ్య చర్యలపై వివరాలను కార్యాలయాల్లో నమోదు చేయాలి. మురుగు వాడల్లో శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తరచూ వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలి.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఎవరికి వారుగా ఆరోగ్య సూత్రాలు పాటించడం ఉత్తమం. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి.

- డాక్టర్ దామోదర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, చేవెళ్ల


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

పరిగి, జూలై 28: పరిగి మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని మునిసిపల్‌లో ఆదివారం 55మంది బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మునిసిపల్ అధికారులు, కౌన్సిలర్లతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇప్పటికే పరిగి మునిసిపల్ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పరిగి పట్టణంలో ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణానికి డిజైనింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలతో త్వరలో సమావేశం నిర్వహించి సూచనలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, కమిషనర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరశైవలింగాయత్ భవనానికి నిధులివ్వండి

ఎరిగిలో వీరశైవలింగాయత్ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు ఇవ్వాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పరిగి ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సంఘం వీరశైవలింగాయత్ తాలుకా అధ్యక్షకార్యదర్శులు గాండ్ల శివరాజు, మల్లేశంలు మాట్లాడుతూ, పరిగిలో రుద్రభూమి కోసం స్థలం కేటాయించాలని కోరారు. అన్ని దేవాయాల కమిటీల్లో ప్రత్యేక స్థానం కల్పించాలని కోరారు. పరిగి నుంచి శ్రీశైలం క్షేత్రానికి నిత్యం ఆర్టీసీ బస్సును నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లింగప్ప, భద్రప్ప, నాగేశ్ తదితరులు ఉన్నారు.

పూడూరు: ప్రభుత్వం పేదలకు అన్ని విధాల తోడుగా ఉంటుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. చింతలపల్లికి చెందిన ప్రమీలకు రూ.54వేలు, మరాఠి పెంటయ్యకు రూ.8500ల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో అనేక జబ్బులకు ఉచితంగానే ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, మాధుసూదన్‌రెడ్డి, నరేందర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు నాగలి బహూకరిస్తున్న నాయకులు


కల్వకుర్తి నియోజకవర్గానికి సీఎం వరాల జల్లు

- ఐదో పేజీ తరువాయి..

తెలంగాణలో ప్రజలు దొరలు, కుటుంబ పాలనను దించి, కాంగ్రెస్సే ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని అధికారం ఇచ్చారని అన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ఈ ప్రాంత దశ దిశ మారనుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎనుముల రేంత్‌రెడ్డిని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారయణరెడ్డి కోరారు. ఎంపీ మల్లురవి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కల్వకుర్తి పేరును ప్రపంచ వ్యాప్తంగా గుర్తుచేసిన జైపాల్ రెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మాడ్గుల మాజీ జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొండల్‌రెడ్డి, సాయిరెడ్డిలు సీఎంకు నాగలి బహూకరించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన

కల్వకుర్తిలో కార్యక్రమాన్ని ముగించుకొని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం సాయంత్రం కందుకూరు మండలం మీర్కాన్‌పేట వద్ద వృత్తి విద్య నైపుణ్య యూనివర్సిటీ కోసం గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబరు 112లోని 57 ఎకరాల ప్రభుత్వ భూమిని యునివర్సిటీ కోసం అధికారులు గుర్తించారు. సీఎం భూముల మ్యాప్‌ను పరిశీలించి ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు.


షాద్‌నగర్‌అర్బన్:మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

మన్‌కీ బాత్‌ను వీక్షించిన నాయకులు

షాద్‌నగర్ అర్బన్/చౌదరిగూడ/కొందుర్గు/కేశంపేట, జూలై 28: ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. బీజేపీ షాద్‌నగర్ లీగల్ సెల్ అధ్యక్షుడు శ్యాంసుందర్ ఆధ్వర్యంలో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని తిలకించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నాయకులు శేరి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎం.మురళి, వంశీకృష్ణ, కోరమోని హరి భూషణ్‌పటేల్, రాము, విజయ్‌కుమార్, రంగన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని మండలాధ్యక్షుడు శ్రీశైలం నివాసంలో బీజేపీ నాయకులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించారు. వెంకటేష్ గుప్త, లక్ష్మీకాంత్‌రెడ్డి, మాణెమ్మ, సత్యమ్మ, అంజమ్మ, శరణ్ భరద్వాజ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మన్‌కీ బాత్ ప్రజలకు మరింత చేరువైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కేశంపేట మండల కేంద్రంలో ఆయన కార్యక్రమాన్ని వీక్షించారు. బీజేపీ మండలాధ్యక్షుడు రొల్ల రఘురాములుగౌడ్, నాయకులు కంచుకోల నర్సింహ, ఐలయ్య, శివాజీ, పాండురంగారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్, రమేష్, నరేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మహేందర్, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మోర్లకు బోనం

- గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పణ
- ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు


శంషాబాద్ : కొత్వాల్‌గూడ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చైర్‌పర్సన్ సుష్మామహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీశ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌లు


షాద్‌నగర్ అర్బన్ : సాయిబాబాకాలనీలో పోచమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


చేవెళ్ల : మండల కేంద్రంలో పోతురాజుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు..


మొయినాబాద్: సురంగల్‌లో ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న గ్రామస్తులు ఊరేగింపు


శంషాబాద్ రూరల్ : నర్కూడలో బోనాలతో ఆలయానికి తరలివెళుతున్న మహిళలు, యువతులు


షాద్‌నగర్ అర్బన్ : అయ్యప్పకాలనీ బోనాల ఊరేగింపులో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి


శంకర్‌పల్లి : బోనాలతో వెళుతున్న మహిళలు



షాబాద్ : హైతాబాద్‌లో అమ్మవారి ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, గొల్లూర్‌గూడలో బోనమెత్తిన మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి


కడ్తాల్ : బోనాలతో గిరిజన మహిళలు


కొత్తూర్ : స్టేషన్ తిమ్మాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు


షాబాద్ : శ్రీ చైతన్య స్కూల్‌లో బోనాలతో చిన్నారులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 28: షాద్‌నగర్ పట్టణంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు నిర్వహించారు. పోచమ్మ, మైసమ్మ తదితర గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డు, సాయిబాబా కాలనీల్లోని పోచమ్మ ఆలయాలకు బోనాలతో తరలివెళ్లి మొక్కుబడులు తీర్చుకున్నారు. డప్పులు, బ్యాండ్‌మేళాల మధ్య పోతురాజుల విన్యాసం, యువకుల నృత్యంతో ఊరేగింపుగా ఆలయాలకు బోనాలతో తరలివెళ్లి నైవేద్యం సమర్పించారు. సాయిబాబా కాలనీలో నిర్వహించిన బోనాల ఉత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అయ్యప్పకాలనీలో బోనాల ఊరేగింపులో ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, కాలనీల పెద్దలు అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు.

కొత్తూర్ : మున్సిపాలిటీలోని స్టేషన్ తిమ్మాపూర్, మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామాల్లో బోనాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు బోనాలను శిరస్సుపై ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లగా, పోతురాజులు నృత్యాలు, శివసత్తుల పునకాలతో మైసమ్మ, పోచమ్మ ఆలయాలకు తరలివెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు చంద్రకళరాజేందర్‌గౌడ్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : మండలకేంద్రంతో పాటు రంగాపూర్, గుడిమామిడిపల్లి, చంద్రాయన్‌గూడ, మైసమ్మ, పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు యువకులు తొట్టెలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ ఈట గణేష్, మాజీ సర్పంచులు జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, ఎనుగొండ రమేష్‌గౌడ్, శ్రీనివాస్, నవీన్‌గౌడ్, కటికపోగు శ్రీనివాస్, మామిళ్లపల్లి నర్సింహ, ముత్యంరెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాచారం : మండలంలోని చౌదర్‌పల్లిలో ఉజ్జయినీ మహంకాళీ బోనాల ఉత్సవం జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం మహిళలు వాడవాడలా తిరిగి అమ్మవారి ఆలయానికి వెళ్లి బోనం సమర్పించారు. ఒగ్గుకళాకారులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం బోనం సమర్పించారు. గ్రామస్తులు తదితరులున్నారు.

తలకొండపల్లి : మండల పరిధిలోని పాతకోట తండాలో బోనాల పండుగను జరుపుకున్నారు. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఆమనగల్లు, మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్‌లు హాజరయ్యారు. మహిళలు బోనం కుండలను అలంకరించుకొని ర్యాలీగా ఆలయాలకు చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తండాలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, సురేశ్, కిశోర్, శేఖర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్ రూరల్ : హిమాయత్‌నగర్‌లో బోనాలతో తరలిన గ్రామస్తులు

కడ్తాల్ : మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో బోనాల వేడుక అంబరాన్నంటింది. గిరిజనులు ముత్యాలమ్మ బోనాల వేడుక ఘనంగా జరుపుకున్నారు. ఏడాదికోసారి నిర్వహించే బోనాల పండుగ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి గిరిజనులు తరలి రావడంతో గోవిందాయిపల్లి తండాలో సందడి నెలకొంది. బోనాల వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బోనాల వేడుక సందడిగా సాగింది. మహిళలు , యువతులు పట్టు వస్త్రాలు ధరించి బోనం కుండలను అలంకరించుకొని బ్యాండ్ వాయిద్యాలతో ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు.ముత్యాలమ్మ, జగదాంబ దేవికి నైవేద్యం సమర్పించి అమ్మోరు తల్లో తమను చల్లంగ చూడంటూ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, గిరిజన నేతలు రాము నాయక్, చత్రునాయక్, పాండునాయక్, సక్రునాయక్, నిరంజన్, రాజేందర్, వెంకట్ నాయక్, మన్యనాయక్, సాయిలాల్, బాస్కర్, రమేశ్ నాయక్, రెడ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతిధిని శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్‌లు అన్నారు. రేఖ్య తండాలో మేరామాయాడి అమ్మవారి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, బీచ్యానాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వారిని సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి, రావిర్యాల, లచ్చంపేట్, పెద్ద ఎల్కిచర్ల, కాస్లాబాద్ తదితర గ్రామాల్లో మైసమ్మ దేవాలయంలోని అమ్మవారికి మహిళలు నేవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖసంతోషాలతో చల్లంగా ఉండేలా దీవించాలని వేడుకున్నారు.

చేవెళ్ల : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బోనాల ఉత్సవాల సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామ దేవతల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి, ప్రజలందరు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు భక్తులు పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని పామెన గ్రామ మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి తన తండ్రి జ్ఞాకార్థకంగా గ్రామంలోని డప్పు కళాకారులకు డప్పులు ఉచితంగా అందించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

శంకర్‌పల్లి : శంకర్‌పల్లిలో బోనాల పండుగ ఘనంగా జరిగింది. మహిళలు పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు పోచమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పూట మహిళలు సామూహికంగా బోనాలతో వెళ్లారు. నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీన్‌కుమార్ పాల్గొన్నారు. పోచమ్మతల్లి దీవెనలు పట్టణ ప్రజలపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాలలో పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

షాబాద్ : మండలంలోని హైతాబాద్, నాగర్‌గూడ, పెద్ద వేడు, గొల్లూర్‌గూడ, మద్దూర్, తదితర గ్రామాల్లో పోచమ్మ, ఈదమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. యువకుల కేరింతలతో బోనాలు, తొట్టెల ఊరేగింపు సాగింది. హైతాబాద్‌లో పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ గ్రామస్థులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా మండల పరిధిలోని నాగర్‌గూడ శ్రీ చైతన్య పాఠశాలలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు పోతురాజుల వేశధారణ, చిన్నారుల నృత్యాలు, అమ్మవారి వేశధారణ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిద్దాపురం ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీరాములు, లిఖిత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గొల్లూర్‌గూడలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి బోనాల వేడుకల్లో పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : మొయినాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో బోనాలు నిర్వహించుకున్నారు. గ్రామాల్లోని గ్రామదేవతలకు ఉదయం నుంచే మొక్కులు చెల్లించుకునేందుకు తరలివెళ్లారు. ముందుగా గ్రామదేవతలకు నజన్(దిష్టి) బోనాలను సమర్పించారు. 144 సెక్షన్ అమలులో ఉండడంతో పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ పవన్ కుమార్ రెడ్డి గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు.

మొయినాబాద్ : పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, తొట్టెల ఊరేగింపులతో మండలంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మొయినాబాద్, సురంగల్, నక్కలపల్లి తదితర గ్రామాల్లో బోనాలతో ఆలయాలకు వెళ్లి గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు భక్తులు పాల్గొన్నారు.

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్‌గూడ, సాతంరాయి, హుడాకాలనీ గ్రామాల్లో బోనమెత్తారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డిలు హాజరై పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు బాగా కురిపించి రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలని గ్రామదేవతలకు మొక్కుకున్నట్లు తెలిపారు. ఆ చల్లని తల్లుల దీవెనలతో నియోజకవర్గం జిల్లాలోనే పేరుగాంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు పోచమ్మ ఆలయంలో నైవేద్యం సమర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీశ్రీనివాస్‌గౌడ్, మేకల వెంకటేశ్ ప్రముఖ న్యాయవాది పగుడాల సిద్దేశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పూజలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయకులు పుడాల శ్రీనివాస్‌గౌడ్, పి.సిద్దేశ్వర్ గౌడ్, మహేందర్, అశోక్, నరేందర్ పాల్గొన్నారు.

కందుకూరు : ఆకులమైలారంలో మహంకాళి అమ్మవారి బోనాలు వైభవంగా జరుపుకున్నారు. మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తెలంగాణ సాంప్రదాయాలకు అద్దంపట్టేలా మైక్‌లు ఏర్పాటుచేసి అమ్మవారి పాటలను వేశారు. మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్ : మండల పరిధిలోని వివిధ గ్రామాలతో పాటు మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి, ఊట్‌పల్లి, కిషన్‌గూడలలో బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. మహిళలంతా బోనం ఎత్తుకుని అమ్మవారి ఆలయానికి తరలివెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నర్కూడలో మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు అధ్వర్యంలో భారీ ఎత్తున బోనాలతో గ్రామ చివరలో ఉన్న అమ్మవారి ఆలయానికి తరలివెళ్లి నైవేద్యం సమర్పించారు. తన్వీరాజు మాట్లాడుతూ మండల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు. అలాగే కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


తలకొండపల్లి : అమ్మవారి ఊరేగింపులో ఉప్పల వెంకటేశ్, నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు


యాచారం : చౌదర్‌పల్లిలో ఉజ్జయిని మహంకాళీ బోనాల ఊరేగింపు


చౌదరిగూడ : తుమ్మలపల్లిలో మైసమ్మ దేవాలయానికి బోనాలతో బయల్దేరిన మహిళలు

ఎమ్మెల్యే శంకర్‌కు రైతుల సన్మానం

చౌదరిగూడ, జూలై 28 : ప్రభుత్వం రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించిన తరుణంలో అన్నదాతలు సంబరాల్లో మునిగిపోయారు. కానీ, బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఖాతాదారులు సాంకేతిక సమస్యలతో ఖాతా నంబరులకు ముందు సున్నా రాని కారణంగా 546 మందికి రుణమాఫీ కాలేదు. సమస్యను ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి అధికారుల దృష్టికి, శాసన సభలో మీడియా పాయింట్‌లో రుణమాఫీ అమలులో రైతు ఎదుర్కొంటున్న సమస్యలను అందరి దృష్టికి తీసుకెళ్లారు. రుణమాఫీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యేను ఆదివారం క్యాంపు కార్యాలయానికి వెళ్లి సన్మానించారు పురుషోత్తం రెడ్డి, జితేందర్‌రెడ్డి, కొయ్యల నరింహులు, రామ్‌రెడ్డి, అంజి, గాలి శ్రీనివాస్, శివ, నర్సింలు తదితరులున్నారు.

చెన్నారెడ్డిగూడ మాజీ సర్పంచ్ మృతి

- నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

మంచాల, జూలై 28 : చెన్నారెడ్డిగూడ గ్రామపంచాయతీ మొదటి సర్పంచ్ లాలూనాయక్ ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. కాంగ్రెస్ రాష్ట్ర నేత కొంగర విష్ణువర్దన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్‌యాదవ్, జంగయ్య యాదవ్, ముచ్చర్ల వెంకటేష్‌యాదవ్‌లు భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఎడమ నరేందర్‌రెడ్డి, కిషన్‌నాయక్, స్వామి, లాలు, పగడాల లక్ష్మన్, ఫకీర, గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ మండల కమిటీ

కందుకూరు జూలై 27: విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సౌకుంట్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మండల రాజులు ప్రకటించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం ప్రత్యేక సమావేశం అనంతరం వారు మాట్లాడారు. మండల శాఖ అధ్యక్షుడిగా ఎగ్గిడి అనీల్ కురుమ, ఉపాధ్యక్షుడిగా అక్కనపల్లి నవీన్, ప్రధాన కార్యదర్శిగా ఎం.సురేష్, భజరంగ్‌దళ్ సంయోజన్‌గా ఎ.దినేష్‌లను నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీ సభ్యులు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న దేవాలయాల భూములను పరిరక్షించడానికి నిరంతరం పనిచేయాలన్నారు.

జైపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం


ఆమనగల్లు : జైపాల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూదిని రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/మాడ్గుల, జూలై 28: ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాంతం పరితపించిన సూదిని జైపాల్‌రెడ్డి చిరస్మరణీయులని, ఆయన సేవలు మరువలేనివని పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ చౌక్‌వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే సూదిని జైపాల్ రెడ్డి ఐదవ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఇతర పార్టీల నేతలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనంత రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. కడ్తాల మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్ హాజరయ్యారు. జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా, మండల నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, చేగూరి వెంకటేశ్, వేణుగోపాల్, హీరాసింగ్, తదితరులున్నారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో ఉన్న జైపాల్‌రెడ్డి స్మృతివనాన్ని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ విజితారెడ్డి, జైపాల్‌రెడ్డి సోదరులు పద్మారెడ్డి, మనోహర్‌రెడ్డి, కుమారులు అరవింద్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డిలు సందర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సూదిని రాంరెడ్డి, ఆనంద్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, తోటపల్లి రాజేశ్, తదితరులు పాల్గొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలోని జయప్రకాశ్ నగర్ కాలనీలోని జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం సభకు తరలివెళ్లారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పాండుగౌడ్,నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, మిద్దే రాములు, తదితరులున్నారు.

సీఎం సభకు భారీగా తరలిన నాయకులు

కల్వకుర్తి పట్టణంలో ఆదివారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. వెల్దండ మండలం కొట్ర గేటు వద్ద జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున జన సమీకరణ చేశారు. ఉదయం గ్రామాల నుంచి మండల కేంద్రానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలు చేబూని ర్యాలీలు నిర్వహించారు. అనంతరం కల్వకుర్తికి తరలివెళ్లారు. ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు ఆధ్వర్యంలో డీజే సౌండ్‌తో ర్యాలీ నిర్వహించి పెద్దఎత్తున బాణసంచా పేల్చారు.

విపక్ష రాష్ట్రాలపై కేంద్రం వివక్ష

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందని, బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని, బీజేపీయేతర పాలిత రాష్ట్రాల పట్ల ఎన్డీఏ ప్రభుత్వం ఆది నుంచీ వివక్ష చూపుతూ నిధుల కేటాయింపులో అన్యాయం చేస్తుందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని తిరస్కరించిన రాష్ట్రాలకు బడ్జెట్‌లో కేంద్రం మొండి చెయ్యి చూపడం సరైంది కాదన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు హక్కుగా రావాల్సిన నిధుల కోసం రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు పోరాటం చేయకుండా, ఒత్తిడి తేకుండా కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కైందని, అందుకే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిన కేసీఆర్ స్పందించడం లేదని ఆరోపించారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను 2025 డిసెంబర్ నాటికి పూర్తిచేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.


కడ్తాల : జైపాల్ వర్ధంతిలో పాల్గొన్న శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ, బీక్యానాయక్, నాయకులు


మాడ్గుల : నివాళులర్పిస్తున్న నాయకులు

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి పడి వ్యక్తి మృతి

తలకొండపల్లి, జూలై 28 : బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని జూలపల్లి గ్రామసమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది., ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కేశంపేట మండలం కాకునూర్‌కు చెందిన గంగోజి బ్రహ్మాచారి(50) తన బావమరిది మణికంఠతో కలిసి బైక్‌పై మిడ్జిల్ మండల కేంద్రానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జూలపల్లి మీదుగా కాకునూర్‌కు వెళుతుండగా బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. రక్తగాయాలైన బ్రహ్మాచారిని స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. మణికంఠ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఇబ్రహీంపట్నంలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇళ్లలో చోరీ

- రూ.30వేలు ఎత్తుకెళ్లిన దుండగులు

నందిగామ, జూలై 28: మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. నందిగామ మండల కేంద్రానికి చెందిన వడ్ల రాము శంషాబాద్ ఎయిర్‌పోర్టులో క్యాబ్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటిపక్కల వారు రాము ఇంటి డోర్ తెరిచి ఉండటం గమనించి రాముకు సమాచారం ఇచ్చారు. అతడు వచ్చి చూసేసరికి బీరువా తెరిచి ఉంది. బట్టలు, వస్తువులు చిందరవందరగా ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలాన్ని నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పరిశీలించి వివరాలు సేకరించారు. రాము ఇంట్లో ఉన్న రూ.30 వేలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు. అదేవిధంగా మండల కేంద్రంలోని మాజీ ఎంపీటీసీ జిల్లెల్ల దామోదర్‌రెడ్డి ఇంటి కింది అంతస్థులో గదిని అద్దెకు ఇచ్చారు. అందులో ఉన్నవారు ఇంటికి తాళంవేసి స్వగ్రామానికి వెళ్లారు. ఈక్రమంలో ఆ ఇంట్లో కూడా గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈమేరకు బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.